ప్రజాశక్తి
శనివారం 13 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను రాజవొమ్మంగి సీఐ అల్లు స్వామినాయుడు శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు, ఎంతమంది ఓటర్లు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ

మన్యంలో సంక్రాంతి సందడి

- వారపు సంతల్లో రద్దీగా షాపులు
- ప్రయాణ ప్రాంగణాలు కిటకిట

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. మరో రెండు రోజుల్లో భోగి పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ గ్రామాల ప్రజలు అప్పుడే వేడుకలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పండుగకు అవసరమైన వస్త్రాలు, చెప్పులు, ఇతర వస్తువులను కొనుక్కోవడానికి వివిధ గ్రామాల ప్రజలు పాడేరుకు తరలివస్తున్నారు. దీంతో, జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ప్రధాన రహదారులు, వస్త్ర, బంగారం, చెప్పులు, కిరాణా, తదితర షాపులు, నిత్యావసర సరుకుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిట లాడాయి. ప్రధాన రహదారులు సందడిగా మారాయి. సంక్రాంతి పండుగ ముందు శుక్రవారం సంత కావడంతో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, దగ్గర మండలాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు అవసరమైన సామాగ్రి, సరుకులు, వస్తువులు, దుస్తులను కొనుగోలు చేశారు. స్థిరంగా ఉండే షాపులతోపాటు వారపు సంతలో రెడీమేడ్ దుస్తులు, ఫ్యాన్సీ, గాజులు, విక్రయించే దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. కింద బజార్ మెయిన్ రోడ్డు జనంతో నిండిపోయి వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. షాపులు అధికంగా ఉన్న చోట ట్రాఫిక్ సమస్య తలెత్తింది.


పాడేరు వస్తున్న బంధువులు


పాడేరు సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

ప్రయాణ ప్రాంగణాలు కిటకిట..

సంక్రాంతి పండగను పురస్కరించుకొని అల్లూరు జిల్లా కేంద్రం పాడేరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాడేరు బస్ స్టేషన్, ఆటో, జీప్ స్టాండ్లలలో రద్దీ నెలకొంది. పట్టణంలోని ఆయా ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సంక్రాంతి పండుగకు రాకపోకలు సాగించే వారు ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు కిక్కిరిసిన ఆటోల్లో, జీపుల్లో ప్రమాదకరంగా వేలాడుతూ ప్రయాణిస్తున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈ పండగను పురస్కరించుకొని మండలంలోని గిరిజనులు నూతన వస్త్రాలతో పాటు ఇతర నూతన వస్తువులు కొనుగోలు చేయడంతో వారపు సంత జనాలతో కిక్కిరిసిపోయింది. ఎటువంటి వస్తువులు కొనుగోలు చేయాలన్నా గిరిజనులకు ప్రధానంగా వారపు సంతలే వేదికలవుతున్నాయి. దీంతో, గిరిజనులు పండగను పురస్కరించుకొని నూతన వస్త్రాలు కొనుగోలు చేయడానికి శుక్రవారం అరకు వారపు సంతకు రావడంతో గిరిజనులతో కిటకిటలాడింది. నాటు కోళ్లు, మేకలను కొనుగోలు చేస్తుండటంతో వాటికి గిరాకీ పెరిగింది. అధిక సంఖ్యలో గిరిజనులు రావడంతో వారపు సంతలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో వాహనాలు నిలిచి పోయాయి.


నిందితున్ని మీడియా ముందు ప్రవేశ పెట్టిన పోలీసులు

మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-విఆర్.పురం

ఇటీవల జరిగిన మహిళ హత్య కేసులో ముద్దాయిని సిఐ రామారావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ బి.వెంకటేష్, సిబ్బంది శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని వీర పాపిన కుంట గ్రామంలో ఈ నెల 5వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సోయం రాధ హత్యకు గురైంది. దీనిపై ఈ నెల 6వ తేదీన రాధ సోదరుడు మిడియం సత్తిబాబు విఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తన అక్క సోయం రాధను తన బావ సోయం చిరంజీవి 5న రాత్రి 11 గంటల సమయంలో కత్తితో పీకను కోసి హత్య చేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విఆర్.పురం పోలీసు కేసు నమోదు చేసి, యటపాక సిఐ డి.రామారావు ఆధ్వర్యంలో విఆర్.పురం ఇన్‌చార్జి ఎస్ఐ బి.వెంకటేష్, యటపాక ఎస్ఐ కె పార్ధసారధి సహాయంతో నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలించారు. దీంతో ఈ నెల 12న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో నిందితుడు సోయం చిరంజీవిని అరెస్టు చేసి, ఆయన వద్ద నుండి కల్లు గీసే కత్తిని, స్వేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య కేసులో ముద్దాయిని గుర్తించి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించారు.


కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్, ఎఎస్‌పి తదితరులు

అరకు ఎంఇఓ ప్రభుత్వానికి సరెండర్

ప్రజాశక్తి-పాడేరు: అరకు మండల విద్యాశాఖా ధికారి-1 వి.త్రినాధారావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేసారు. వి. త్రినాధారావు తన విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఆయనపై విచారణకు ఆదేశించటం జరిగిందని, విచారణాదికారికి సహకరించ లేదన్నారు. ఉద్దేశ పూర్వకంగానే జిల్లా కలెక్టర్ సమీక్షలకు హాజరు కాలేదని, ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ ఆయనలో మార్పు రాలేదని గుర్తిస్తూ ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఏఎస్‌పి జగదీష్ అడహళ్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి ముఖ్యమైన పండగ సంక్రాంతిని భక్తి శ్రద్దలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఏఎస్పి జగదీష్ అడహళ్లి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే సంక్రాంతి పండుగ ఎవరికి ఇబ్బంది లేకుండా పండగ జరుపుకోవాలన్నారు. అనంతరం ముగ్గులు పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి సంకూరు హేమరత్నమణి, పి.మాధురికి, రెండో బహుమతి కె.సునీతకు, మూడో బహుమతి నిహారికకి అందజేశారు. వెలుగు ద్వారా ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను అతిథులు సందర్శించారు.

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు ముగ్గుల వేసి అలంకరించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యమ్‌డి యూసఫ్ పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి క్లస్టర్ హెడ్ సూర్య, రంపచోడవరం బ్రాంచ్ మేనేజర్ తీగల మురళీమోహన్, టిఏఓ రాంబాబు, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్ర మూర్తి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

100 మెట్రిక్ టన్నుల మిరియాల సేకరణే లక్ష్యం

- రైతులు దళారీలను నమ్మవద్దు
- మంచి ధరకు విక్రయించుకోవాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన



ప్రజాశక్తి-పాడేరు: మిరియాల పంటకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని, ఇటువంటి సమయంలో రైతులు ఆచి తూచి మంచి ధరకు అమ్ముకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మిరియాల రైతులకు విజ్ఞప్తి చేసారు. మిరియాల రైతులు వారి దగ్గరున్న మిరియాలను శుబ్ర పరచి సిద్ధం చేసుకోవాలని, దీంతో మంచి ధర లభిస్తుందని, కిలో రూ.500కు తగ్గకుండా అమ్మాలని సూచించారు. గత ఏడాది కూడా రూ. 500లకు తక్కువ లేకుండా అమ్మిన విషయాన్ని గుర్తు చేసారు. మధ్య దళారీలను నమ్మకుండా నేరుగా వర్తకులకు అమ్మడం ద్వారా ఎక్కువ లబ్ది పొందవచ్చని వివరించారు. అదేవిధంగా ఐటిడిఎ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకున్నామని, ఐటిడిఎ కిలో రూ. 500లకు తక్కువ కాకుండా మేక్ష్ సొసైటి ద్వారా కొనుగోలు చేస్తుందని, అందుకు తగిన పరిహారం కూడా ఒక్క వారం రోజులలోనే చెల్లించటం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ ఏడాది నాన్యవంతమైన మిరియాలు అందించటానికి జిల్లా యంత్రాంగం, ఐటిడిఎ కృత నిశ్చయంతో ఉన్నందున రైతులు మిరియాలను శుభ్రపరుచుకుని కిలో రూ. 500 లకు తక్కువ కాకుండా అమ్మాలని సూచించారు. ఐటిడిఎ ఈ ఏడాది వంద మెట్రిక్ టన్నుల మిరియాలు సేకరణ లక్ష్యంగా పెట్టుకుందని కలెక్టర్ వివరించారు.



ఆందోళన చేస్తున్న టిడిపి నేతలు

రేషన్ బియ్యం పంపిణీ చేయాలని టిడిపి నేతల ఆందోళన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో అతి మారుమూల ప్రాంతమైన బాబుసాలా, బుంగ పుట్టు పంచాయతీలలో గత మూడు నెలలుగా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ చేయలేదని శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల టిడిపి నాయకులు శాస్త్రి బాబు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉచిత బియ్యం సరఫరా చేయాలని నినాదాలు చేస్తూ కార్యాలయ ప్రాంగణంలో బైఠాయించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు శాస్త్రి బాబు మాట్లాడుతూ,రెండు పంచాయితీ పరిధిలో మొండిగుమ్మ, గాజులబంధ, సోపుట్టు, మత్స్య పురం, గుణ సల్మా, కొజ్జారిగూడ, గర్రం, రంగినిగూడా, కోసొం పుట్టు, కొత్తగరం, బంగురుపల్లి, సిరగంపుట్టు గ్రామ పివిటిసిలకు ఉచిత పంపిణీ కోటా బియ్యం అందలేదని, తక్షణమే మూడు మాసాల కోట బియ్యం తక్షణమే అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల లబ్ధిదారులు, టిడిపి మండల నేతలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పోలీసు శాఖ కృషి

ప్రజాశక్తి -సీలేరు

పోలీస్ శాఖ ఉన్నతాధికారుల కృషితో మారుమూల గిరిజన గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసపల్లి, మానసపల్లి, పిప్పళ్ళ పోదర్, పులిగుప్ప, చింతగొప్ప, గొర్రెలోవ, కొమ్ములవాడ గ్రామాల్లో ఎస్సై రామకృష్ణ విస్తృతంగా పర్యటించారు. గిరిజనులతో సమావేశమై గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రహదారులు, మొబైల్ సిగ్నల్ ఏర్పాటు, తాగునీరు తదితర సమస్యలపై పోలీస్ శాఖ ఇప్పటికే దృష్టి సారించి నెరవేర్చిందని తెలిపారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన యువత ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలన్నారు. అనంతరం గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఘనంగా వివేకానందుని జయంతి వేడుకలు



వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద తన బోధనలతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యువకులను ప్రేరేపించారని తెలిపారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో భారతదేశ ఆధ్యాత్మిక విషయాల గురించి ప్రపంచానికి వివరించారన్నారు. ఆర్ధశాస్త్ర విభాగాధిపతి జి.వెంకట్రావు, ఆంగ్ల విభాగాధిపతి ఆర్‌సిహెచ్.నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్, అధ్యాపకులు వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి, కె.శకుంతల, కె.శైలజ, ఎమ్.నాగమోహనరావు, సిహెచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, వి.శీనయ్య, ఎన్.రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, జి.సాయికుమార్, పి.అలివేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని కెవిఆర్ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, గోలి వికాస్ మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో ధైర్యంగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృపారావు, రామారావు, వల్లి సుందరం, నాగేంద్ర, లక్ష్మణ్, బండి శ్రీనివాస్, మహేష్, ఎడ్ల రాజు, నాయుడు, కృష్ణసాయి, పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె పుష్పరాజు, డిగ్రీ కళాశాల రిసోర్స్ పర్సన్ పి నాగబాబు పేర్కొన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే.పుష్పరాజు, నాగబాబు మాట్లాడుతూ, దేశం అభివృద్ధి యువతపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వై.విజయలక్ష్మి, ఎం అనిత కుమారి, అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్, పి సుందరిరాణి, ఎస్.రాజు, బి.లచ్చన్న, బి.గురవయ్య, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ పుష్పరాజు

తాగునీటి పథకం మోటారు బాగు చేయరూ..

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని తాళ్ల గొమ్ము, రేగులపాడు, బొజ్జరాయి గూడెం గ్రామాల్లో తాగునీటి పథకానికి సంబంధించిన మోటార్ పని చేయడం లేదని గ్రామ ఉప సర్పంచ్ నానుపల్లి హరి అన్నారు. దీంతో వారం నుండి గ్రామంలో నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి మోటార్ మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


మరమ్మతుకు గురైన మోటారు

వేటుకూరులో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని వేటుకూరు గ్రామంలో స్వేచ్ఛ స్వచంద సంస్థ డైరెక్టర్ శ్రీపతి రాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సార్ల లలిత కుమారి మాట్లాడుతూ లైబ్రేరిని ప్రతి ఒకరు ఉపయోగించుకోవాలన్నారు. పుస్తక పఠనం, వార్త పత్రికలు చదివి అనేక విషయాలు తెలుసుకోవచ్చని, కంప్యూటర్ కోర్స్‌లు, చిల్డ్రన్ లెర్నింగ్ కోర్స్‌లు నేర్పిస్తారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు గొర్లె బాలాజీబాబు మాట్లాడుతూ కంప్యూటర్ టెక్నాలజీలో ఉన్న డిజిటల్ లైబ్రరీ ద్వారా ప్రపంచంలో జరుగుతున్న విషయాలు తెలుసుకోవచ్చన్నారు. వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి మాట్లాడుతూ స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తమారావు, గ్రామ పెద్దలు గొర్లె మురళీకృష్ణ, గొర్లె నారాయణ రావు, జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

సమయపాలన పాటించకుంటే చర్యలు

స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కారం : కలెక్టర్ సుమిత్ కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పాడేరు : ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సకాలంలో హాజరు కానివారిపై చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ కే.కార్తిక్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్ఓ వివి రమణ ఫిర్యాదుదారుల నుండి 87 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారాణాదికారిని నియమించాలన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపి, సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో అందిన ఫిర్యాదులపై కూడా సకాలంలో స్పందించాలని ఆదేశించారు. కొంతమంది అధికారులు సకాలంలో లాగిన్ అవ్వక పోవడం, సమస్య పరిష్కారం కాకుండా అయినట్లు అప్లోడ్ చేయడం వంటివి గుర్తించామని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఈ నెల 15న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిఎం జన్ మన్ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని, అరకు మండలం కొత్త భల్లుగూడలో ఏర్పాటు చేసామని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 19వ తేదీన విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవంలో భాగంగా 17,18 తేదీలలో సామాజిక సమత సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు అందులో భాగంగా 18న అన్ని సచివాలయాల ఫరిదిలో అంబేద్కర్ విగ్రాహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించాలన్నారు, ప్రజలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, ఉద్యోగులతో అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కలక్టరేట్ లో రక్త దాన శిభిరం ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగులైన ఐదుగురుకి ఐటిడిఎ ఆవరణలో వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ట్రై సైకిల్స్ పంపిణీ చేసారు. అదేవిధంగా ఒకరికి వినికిడి పరికరాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కే.కార్తిక్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్ఓ వివి రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదులు:

- జి.మాడుగుల మండలం కోరాపల్లి పంచాయతి పాలకొండ గ్రామానికి చెందిన పివిటిజి పి. చిరంజీవి ఇంటి మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. పాడేరు మండలం కాడెలి పంచాయతి, గురుపాల్లి గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని, ఆ గ్రామానికి చెందినా కే. పద్మ కుమారి, కే. విమల దరఖాస్తు సమర్పించారు.

జి.మాడుగుల మండలం పాలమామిడి పంచాయతి కొంతులం గ్రామానికి చెందిన పాలికి రాట్నాలమ్మ రైతు భరోసా మంజూరుకు దరఖాస్తు సమర్పించారు.చింతపల్లి మండలం బలపం పంచాయతి గుంజి వీధికి చెందిన జి.శాంతి, జి. ఆదినారాయణరావులు గ్రామానికి సిసి రోడ్డు, పాఠశాల, అంగన్వాడి భవనాలు మంజూరు చేయాలని కోరారు. హుకుంపేట మండలం అడ్డుమండ, దిగువ మొదాపుట్టు వంతెన వర్షానికి కొట్టుకు పోయినందున మరమ్మత్తులు చేపట్టాలని ఆ గ్రామ సపంచ్ గుమ్మ శ్యామలరావు విన్నవించారు. ముంచుంగుపుట్టు మండలం బంగారు మెట్ట సర్పంచ్ దరఖాస్తు చేస్తూ మాలగుమ్మి నుండి బాసిపుట్టు వరకు తారు రోడ్డు నిర్మించాలని కోరారు.

ముంచుంగిపుట్టు మండలం పనసపుట్టు, బోడి పుట్టు, ముక్క పుట్టు, బోడ్డాపుట్టు, గ్రామాలకు అదనపు విధ్యుత్ సౌకర్యం కల్పించాలని, జనం తిరుపతిరావు దరఖాస్తు చేసారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎయు విద్యార్థులు

-అభినందించిన వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య కె.సమత

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లను ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమత శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమూహంగా పని చేయడం, కార్యసాధక నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎయు ఎన్‌సిసి సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇపిఎస్ భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారిణి అనసూయ పాల్గొన్నారు. ఎయు పరిధిలోని జివిపి కళాశాల విద్యార్థిని జి.కావ్యదేవి, డాక్టర్ విఎస్ కృష్ణా కళాశాల విద్యార్థిని ఏ.చూడామణి, ఎయు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామరాజు, గాజువాక - టిబికె డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వ మోహన్ జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొంటారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

భిక్షాటన, భోగి మంటలతో వినూత్న నిరసన ... రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల సంఘీభావం



రాజవొమ్మంగిలో భోగి మంటలు చుట్టూ నృత్యాలు చేస్తూ నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అంగన్వాడీల సమస్యల్ని తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, గ్రామ పోలీసులు సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే సహించేది లేదని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. శుక్రవారం పాడేరు అంగన్వాడీల నిర్వహిస్తున్న 32వ రోజు సమ్మెలో భాగంగా నిరవధిక దీక్ష శిబిరానికి విచ్చేసిన చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో సమ్మెను విరమింప జేయాలన్నారు. సమ్మె కాలం నాటి జీతాలు కోత విధించి మిగులు జీతాలు వేయడాన్ని తప్పుపట్టారు. సమ్మె చేస్తున్నామని ముందుగానే రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారని గుర్తు చేశారు. కోత విదించిన సమ్మె కాలం నాటి జీతాలు తక్షణమే అకౌంట్లో వేయాలని డిమాండ్ చేశారు. జి.కే వీధి మండలంలో గ్రామ పోలీసు సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడుతుందని, ఇటువంటి చర్యలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్రావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న దీక్ష మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంకు జంక్షన్ వద్ద అంగన్వాడి కార్మికులు ఆందోళన చేపట్టారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేపడతామని వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే కొండమ్మ, కే.సత్యవతి, జి.పవిత్ర అంగన్వాడీ కార్మికులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. విధుల్లో చేరాలని నోటీసులు పోస్టల్ ద్వారా పంపిస్తున్నారు. పోస్టల్ ద్వారా పంపించిన నోటీసులను అంగన్వాడీ వర్కర్లు తిరస్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికైనా న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి.రాజమ్మ, శాంతి, మంగమ్మ, వరహాలమ్మ, భవాని, రాణి పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలో అంగన్వాడీల సమ్మె 32వ రోజు చేరుకుంది. కనీస వేతనం రూ.26 వేతనంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మరింతగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు కె.లక్ష్మి, చిలకమ్మ, సుమిత్ర పాల్గొన్నారు.

అంగన్వాడీల భిక్షాటన

రంపచోడవరం : అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన దీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అంగన్వాడీలు బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం దీక్ష వేదిక వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి మాట్లాడుతూ 32 రోజులుగా తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం 32 నెంబరు ఆకారంలో నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగారమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

భోగి మంటలు వేసి నిరసన

రాజవొమ్మంగి : అంగన్వాడీలు 32వ రోజు సమ్మెలో భాగంగా డిమాండ్లకు ప్రజల మద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం దీక్ష శిబిరం చేపట్టారు. అలాగే శుక్రవారం ప్రభుత్వం యూనియన్ నాయకులను చర్చలకు పిలిచిన నేపథ్యంలో చర్చలు ఫలించాలని కోరుతూ శిబిరం వద్ద అంగన్వాడీలు భోగిమంటలు వేసి, లయబద్ధంగా నృత్యాలు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, అంగన్వాడి యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను, ఎల్ సత్యవతి, రమణి, రమణ, సత్యవతి, సుందరమ్మ, మంగ, భవాని, రాధ, వీరలక్ష్మి, వీరయ్యమ్మ, రత్నం పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

కూనవరం : అంగనవాడీ సమ్మె శిబిరం వద్ద శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సిఐటియు మండల కార్యదర్శి కొమరం పెంటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోగా బెదిరింపులకు పాల్పడుతుందని, అటువంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, జనసేన ఎంపిటిసి బండారు సాంబశివ, బద్రి, టిడిపి మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి, సిపిఐ జిల్లా నాయకులు మండా దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సిపిఎం, సిఐటియు నేతల సంఘీభావం

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లిలో అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు సిహెచ్ సుబ్బారావు, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, నాగమణి, ముసురు రాజేశ్వరి, నాయకులు వల్ల కృష్ణారెడ్డి, నాలారపు ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంఘీభావం

చింతూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరానిన శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇల్లా చిన్నారెడ్డి, వెంకటేశ్వర్లు. ఎండి జహంగీర్, తమ్మయ్య, ఫిరోజ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, రామారావు, నూకరాజు, నరసింహారావు, యూనియన్ నాయకులు నూక రత్నం, సవలం వెంకటరమణ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో సంతకాల సేకరణ



పాడేరులో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్



చింతూరులో మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి సంఘీభావం

రూ.10 కోట్లు బకాయి

- రైతుకు సకాలంలో పడని డబ్బులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పట్ల తగ్గుతున్న ఆసక్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ మందకొడిగానే సాగుతోంది. తీవ్రమైన కరువు, కోతల సమయంలో భారీ వర్షాలతో పంట నష్టం జరగడంతో దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇచ్చిన రైతుకు సకాలంలో డబ్బులు జమకావడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు రూ.10 కోట్లు బకాయి పడింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల పట్ల పెద్ద అసక్తి చూపడంలేదు. గతేడాది సేకరించిన ధాన్యం పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది 35 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరా సంస్థ నిర్ణయించింది. ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికిగానూ 1,10,765 (81 శాతం) ఎకరాల్లో సాగైంది. తరువాత వర్షాలు ఎడపెట్టడం, కోత సమయంలో భారీ వర్షాలు పడ్డంతో వరి పంట నష్టం భారీగా జరిగి దిగుబడులు పడిపోయాయి. గతేడాది కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గుతుందని వేసిన అంచనా కంటే దిగుబడులు తగ్గాయి.

జిల్లాలో 72 క్లస్టర్ల ద్వారా 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయాలని అనుకున్నప్పటికీ ఇంతవరకు దాదాపు 5,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగలిగారు. జిల్లాలోని 24 మండలాల్లోవున్న 380 రైతు భరోసా కేంద్రాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి 72 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. రెండు వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఎ-కేటగిరీ క్లస్టర్‌గానూ, వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల మధ్య వచ్చే కేంద్రాలను బి-కేటగిరీగానూ, వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువ ధాన్యం వచ్చే కేంద్రాలను సి-కేటగిరీగానూ విభజించారు. ఎ, బి కేటగిరీల్లోని క్లస్టర్లకు ఇంతవరకు 1600 మంది రైతులు 5,800 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకొచ్చారు. అయితే వీరికి సుమారు రూ.12 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సివుండగా కోటి రూపాయలు మాత్రమే జమైంది. మరో కోటి లెక్క తేలాల్సి ఉంది. మొత్తంగా సర్కారు రూ.10 కోట్లు బకాయి పడింది. డబ్బులు ప్రభుత్వం నుంచి సకాలంలో రాకపోవడంతో కొద్దిపాటి ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి వెనుకాడుతున్నారు. సి కేటగిరీలోని రైతులు సొంత అవసరాలకు తప్ప అమ్ముకోవడానికి ధాన్యంలేవని చెబుతున్నారు. పంట నష్టం, ధాన్యం దిగుబడి తగ్గడం, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతుకు సకాలంలో డబ్బులు జమకాకపోవడం వంటి కారణాల రీత్యా ఈ ఏడాది 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పౌరసరఫరాల సంస్థ చేరుకొనే అవకాశాలు తక్కువగా వున్నాయి.

అత్యున్నత మేనేజ్‌మెంట్ విద్యే లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ భారతదేశంలో అత్యున్నత స్థాయి మేనేజ్‌మెంట్ విద్యే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని బద్రుక ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కిషన్ బద్రుక తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ 2030 నాటికి భారతదేశం ఏడు డాలర్ల ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాది రాష్ట్రాల సహకారం 35 శాతం ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో కొత్తగా ప్రారంభించిన 'బద్రుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్' ప్రపంచ స్థాయి మేనేజర్లను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందన్నారు. 73 ఏళ్ల బద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ ఇటీవలే బద్రుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (బిఎస్ఎం)ని ప్రారంభించిందన్నారు. ఎఐసిటిఇ ఆమోదించిన రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్‌ను కూడా ప్రవేశపెట్టిందన్నారు. దక్షిణ భారతదేశంలో నాణ్యమైన మేనేజ్‌మెంట్ విద్యను అందించే సంస్థలలో ఉన్న అంతరాన్ని పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అత్యున్నత స్థాయి మేనేజ్‌మెంట్ విద్యే లక్ష్యంగా బిఎస్ఎం రూపొందించబడిందని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు.

విశాఖ మార్కెట్‌లోకి ఇండియా ఆస్టర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ ఆటోమొబైల్ బ్రాండ్ మోరిస్ గెరేజెస్ (ఎంజి) తన నూతన ఎస్‌యువి వాహనం ఎంజి యాస్టర్ 2024ను శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్‌లోని కాళీమాతా టెంపుల్ వద్ద ఉన్న షోరూమ్‌లో ఆవిష్కరించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంజి మోటార్ ఇండియా, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొత్త ఆస్టర్ 2024 అద్భుతమైన ఫీచర్లతో వస్తుందని తెలిపారు. ముందు వరుసలో వెంటిలేషన్ కలిగిన సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో అండ్ ఆపిల్ కార్ ప్లే, అదనపు భద్రత కోసం ఆటో-డిమ్మింగ్ వంటివి ఉన్నాయన్నారు. ఐఆర్‌విఎం అధునాతన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌తో అప్‌డేట్ చేయబడిన ఐ-ఎస్ఎంఎఆర్‌టి 2.0 సంపూర్ణ డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుందని అన్నారు. ఎఐ సాంకేతికత కలిగి ఉన్న భారతదేశపు మొట్టమొదటి ఎస్‌యువి వాహనం ఇదని, దీని ధర రూ.9,98,000 (ఎక్స్-షోరూమ్)తో ప్రారంభమవుతుందని తెలిపారు.

మాట తప్పి.. మడమ తిప్పి..

- నాడు 'మహిళలే మహారాణులు' అని పలుకులు
- నేడు 'మగ మహారాజులు'కు అందలం
- విశాఖలో 'అధికార' రాజకీయమిదే..
- పిసిపిఐఆర్, గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ల మార్పు వెనుక ఆంతర్యమేంటి ?
- అక్కరమాని కుటుంబానికి దక్కని చోటు



భార్య స్థానంలో వికెపిసిపిఐఆర్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చొక్కాకుల

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నిన్నటి వరకూ 'మహిళలే మహారాణులు' అంటూ కొనియాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అకస్మాత్తుగా వారి స్థానాలను వారి వారి కుటుంబాల్లోని మగవారితో నింపడం వెనుక ఆంతర్యమేమిటి ? అన్న చర్చ విశాఖలోనూ, అధికార పార్టీలోనూ అంతర్గతంగా సాగుతోంది. వైసిపి అధిష్టానం కదలికలు చూస్తే విశాఖపై ప్రత్యేక దృష్టి సారించిందన్నది స్పష్టమవుతోంది. అత్యధికంగా మధ్య తరగతి ప్రజలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలకు నెలవైన విశాఖ నగరంలో తమ పార్టీ పట్టుకోల్పోతుందన్న సంకేతాలు వైసిపిని గట్టిగా తాకినట్లు తెలుస్తోంది. మధ్య తరగతి మహిళలను ప్రభావితం చేసేలాగ కొన్ని పదవులను విశాఖలో మహిళలకు ఆ పార్టీ కేటాయించినప్పటికీ చివర వరకూ దాన్ని సిఎం జగన్ నిలుపుకోలేకపోవడం చర్చనీయాంశమైంది. ఉదాహరణకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కొండా రమాదేవిని పక్కనపెట్టి ఆమె సోదరుడు కొండా రాజీవ్ గాంధీని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పార్టీ నామినేట్ చేసింది. తాజాగా ముగ్గురు మహిళలకు వారి పదవులను ఇలా దూరం చేసిన ఘనత వైసిపిదే. ఇలాగైతే మహిళలకు వైసిపి ఏం గౌరవం ఇచ్చినట్టు అంటూ ఆ పార్టీలోనే దిగువ శ్రేణి మహిళా నాయకులు ఆవేదన చెందుతున్నారు..

విశాఖపట్నం - కాకినాడ వికెపిసిపిఐఆర్‌లోనూ ఇదే తంతు...

విశాఖపట్నం కాకినాడ పెట్రోలియం కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (వికెపిసిపిఐఆర్) ఛైర్‌పర్సన్‌గా చొక్కాకుల వెంకటలక్ష్మి ఇప్పటివరకూ వ్యవహరించారు. తాజాగా ఆమె స్థానంలో భర్త వెంకటరావును వైసిపి అధిష్టానం కూర్చోబెట్టింది. విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన అక్కరమాని వెంకటరావు సతీమణి, 2019లో తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో వైసిపి తరపున బరిలోకి దిగి ఓటమి చెందిన అక్కరమాని విజయనిర్మలకు ఏ పదవీ ప్రస్తుతం దక్కకపోవడం గమనార్హం. ఆమె గతంలో వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగానూ పనిచేశారు. ఆ బాధ్యతలూ నేడు లేవు. విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు తూర్పు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించడమే కాకుండా అక్కడి నుంచి వైసిపి అభ్యర్థిగా టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ వెలగపూడిపై పోటీకి వైసిపి అధిష్టానం దింపింది. దీంతో తూర్పులో రాజకీయం రసవత్తరంగా మారనుంది. 'మహిళల స్థానాలను విశాఖ కేంద్రంగా గల్లంతు చేసినా వ్యతిరేకత రాకపోవడం వెనుక సొంత కుటుంబంలో వారికి ఆ పదవులను కేటాయించడమనే అంశం దాగిఉంది' అని వైసిపి నేతలు చెబుతున్నారు. ఏదిఏమైనా అతిముఖ్యమైన పదవులను మహిళలకు కేటాయించినట్లే కేటాయించి 2024 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వెనక్కి తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయమే నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇది లాభమా ? నష్టమా ? అన్న చర్చ అధికార పార్టీలో సాగుతోంది.

ఫలించిన సిపిఎం పోరాటం

ఉక్కు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : '38 ఏళ్ల సుదీర్ఘ పోరాటం వల్ల ఎట్టకేలకు ఉక్కు నిర్వాసితులైన అగనంపూడి దగ్గరలోని కర్ణవానిపాలెం, శనివాడ గ్రామాలకు చెందిన 97 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇది సిపిఎం పోరాట విజయం' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. కర్ణవానిపాలెం దగ్గరలోనే లేఅవుట్ వేసి ఒక్కో కుటుంబానికి 107 గజాల చొప్పున ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. శుక్రవారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో అయన మీడియాతో మాట్లాడారు ఉక్కు కర్మాగారం నిర్మాణానికి 68 గ్రామాల ప్రజలు 23 వేల ఎకరాల భూమిని త్యాగం చేశారని. తమ ఇళ్లను, భూములను త్యాగం చేసిన అనేక మంది నిర్వాసితులకు పునరావాస సదుపాయాలు కల్పించకుండా ఏలిన పాలకులు అనేక ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. మొదట నుంచీ సిపిఎం ఉక్కు నిర్వాసితులకు అండగా ఉండి వారికి న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణవానిపాలెం, శనివాడ గ్రామాల్లో 119 ఉక్కు నిర్వాసిత కుటుంబాలకు పాలకులు రకరకాల కుంటి సాకులు చెప్పి చట్ట ప్రకారం ఇవ్వాల్సిన 107 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం ఒకరికొకరు మాది కాదు బాధ్యత అని వివాదాలు సృష్టించి ఏళ్ల కాలంగా అన్యాయం చేస్తూ వచ్చాయన్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ఇన్నేళ్లూ పూరి గుడిసెల్లో నిర్వాసితులు దయనీయమైన జీవితం గడపాల్సి వచ్చిందని తెలిపారు. సిపిఎం ఈ సమస్యపై సుదీర్ఘ కాలం పోరాటం చేసిందని, ఉక్కు యాజమాన్యం మీద ఒత్తిడి చేసి భూ సర్వే చేయించి 119 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు లేఖలు పంపిందని తెలిపారు. పలుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రులు, రెవెన్యూ మంత్రుల దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లిందన్నారు. అనేకసార్లు జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక చర్చలు జరపడంతో పాటు ఆందోళనలనూ నిర్వహించిందన్నారు. చివరికి జిల్లా కలెక్టర్‌కు ఇళ్ల స్థలాల కోసం భూమిని చూపించడంతో పాటు దానిని సర్వే చేయించి లేఅవుట్ వేయించిందన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం 96 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేసినందుకు జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తక్షణం నిర్వాసితులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడానికి రూ.10 లక్షల సబ్సిడీతో కూడిన ఆర్థిక సహకారం అందించాలని, లే అవుట్‌లో రోడ్లు, కాలువలు, విద్యుత్, మంచినీరు, ఇతర సామాజిక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపించాలని ప్రజా, మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం భారత్ బచావో జిల్లా అధ్యక్షులు పి.వేమన, కన్వీనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి దోషులను తిరిగి జైలుకు పంపించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ 2002లో గుజరాత్ మారణకాండలో బిల్కిస్ బానో సామూహిక అత్యాచారానికి గురైందని, బిడ్డతో సహా ఏడుగురు కుటుంబ సభ్యులను కోల్పోయిందని తెలిపారు. ఆ కేసులో మహారాష్ట్ర ముంబయి సెషన్స్ కోర్టు 11 మందిని నేరస్తులుగా పరిగణించి జీవిత ఖైదు విధించిందని తెలిపారు. ముద్దాయిలు ఈ కేసులో రెండుసార్లు బొంబాయి హైకోర్టులో శిక్ష తగ్గించాలని పిటిషన్స్ వేయగా 2019, 2020ల్లో వారి అభ్యర్థనలను కోర్టు తిరస్కరించిందని గుర్తు చేశారు. ఆ తరువాత జరిగిన పరిణామాలను వివరించారు. గుజరాత్ ప్రభుత్వం 2022 ఆగస్టు 15న భారత ప్రజల న్యాయ విశ్వాసాలను పరిహాసిస్తూ నేరస్తులను విడుదల చేసిందని మండిపడ్డారు. వారి విడుదలను సుప్రీంకోర్టు తప్పుపట్టి, నేరస్తులను రెండు వారాల్లోగా తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించిందన్నారు. దేశ ప్రజల న్యాయ ఆకాంక్షలను ఈ తీర్పు ఈ కేసు విషయంలో నెరవేర్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ, జై భారత్ పార్టీ నాయకులు కారం మమత, ఎస్‌యుసిఐ అధ్యక్షులు వై.గోవిందరాజులు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రతినిధి ఎస్.సుధాకర్, హెచ్‌ఆర్ఎఫ్ ప్రతినిధి అనురాధ, దళిత నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, ఆప్ జిల్లా మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు దిగితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు, పేకాట, బల్లాటలు వంటివి నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కెవి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఈ తరహా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పండగ సందర్భంగా స్థలాలు, భూములు ఇచ్చిన వ్యక్తులు, అశ్లీల నత్యాలు ప్రదర్శించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతల సమస్యతో పాటు కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశమున్నందున సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా వుండాలన్నారు. గతంలో పట్టుబడిన వారిపై బైండోవర్ చేయనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాల ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకుగానీ, డయల్ 100, 112 నెంబర్లకుగానీ ఫోన్ చేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా వుంచుతామన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతగా విశాఖ బార్ అసోసియేషన్ జట్టు నిలిచింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 8న విశాఖ, రాజమహేంద్రవరం జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో విశాఖ జట్టు 71 పరుగుల తేడాతో విజయం సాధించింది. నిర్ణీత 18 ఓవర్లలో విశాఖ జట్టు 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేయగా రాజమహేంద్రవరం జట్టు 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 88 పరుగులే చేసింది. విశాఖ జట్టులో న్యాయవాదుల అంతర్జాతీయ క్రికెట్ టోర్నీకి ప్రాతినిధ్యం వహించిన పక్కుర్తి సురేష్ కుమార్, చెన్నా సతీష్‌లు ఉండడం విశేషం.

అందరి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అందరి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలే దక్షిణంలో వైసిపి జెండా ఎగురవేసేలా చేస్తాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జివిఎంసి 32, 33, 34 వార్డులకు సంబంధించి మనోరమ థియేటర్ వద్ద శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

18వ వార్డులో కొనసాగిన ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనంలో జనం కోసం పేరుతో తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర 20వ రోజుకు చేరుకుంది. శుక్రవారం కూడా 18వ వార్డులోనే యాత్ర సాగింది. 11 కిలోమీటర్ల మేర నిర్వహించారు. ఈ సందర్భంగా 18వ వార్డులో ఆయన గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ ప్రగతిని వివరించారు.